ముంచిన మొంథా

- జిల్లాపై విరుచుకుపడిన తుఫాన్
- నీట మునిగిన వరి, పత్తి పంటలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- జిల్లాలో 25,816 ఎకరాల్లో పంటలకు నష్టం
- కన్నీరుమున్నీరవుతున్న అన్నదాతలు
- పంట నష్టంపై అధికారుల ప్రాథమిక అంచనా


నెమలిగొండలో నీట మునిగిన వరిని చూపుతున్న బాధిత రైతు గాదె కుమార్


ఇప్పగూడెంలో నీట మునిగిన వరిని చూపుతున్న రైతు బోయిని కుమార్

జనగామ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ అన్నదాతను నిండా ముంచింది. తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ నుంచి అతి భారీ వర్షాలతో జిల్లావ్యాప్తంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్ష తీవ్రతతో చేతి కందివచ్చిన పంటలు కళ్లముందే నేలకొరగడంతో అన్నదాతలు కుదేలైపోయారు. కోత దశకు వచ్చిన వరి, తీత దశకు వచ్చిన పత్తి వర్షార్పణం కావడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది.

25816 ఎకరాల్లో పంట నష్టం

జిల్లావ్యాప్తంగా బుధవారం కురిసిన వర్షాల కారణంగా 25816 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో సుమారు 3.57 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలు సాగయ్యాయి. ఇందులో వరి, పత్తి, మొక్కజొన్నకు 25,816 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో వరి 19131 ఎకరాల్లో, పత్తి 6416 ఎకరాల్లో, మొక్కజొన్న 249 ఎకరాల్లో, టమాట, మిర్చీ 20 ఎకరాల్లో నష్టం జరిగింది. జిల్లావ్యాప్తంగా 142 గ్రామాల పరిధిలోని 9888 మంది రైతులకు సంబంధించి రైతులు పంటలు నష్టపోయారని అధికారులు గుర్తించారు. ఇందులో సంబంధించి

నీళ్లలోనే పంటలు

తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బుధవారం ఉదయం రాత్రి వరకు పాటు ఏకధాటిగా కురిసిన వర్షాలతో వరి, పత్తి పంటలు నీటమునిగాయి. సాగు నీటి ఎద్దడి కారణంగా ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో వరి పంటను ఆలస్యంగా సాగు చేయడంతో కోతలు సైతం ఆలస్యంగా వచ్చాయి. వర్షాకాలం ముగియడంతో కోతలకు ఇబ్బంది ఉండదని రైతులు భావిస్తున్న తరుణంలో తుఫాన్ విరుచుకుపడింది. దీంతో జిల్లాలో చాలా ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరి పంట వర్షం కారణంగా నేలకొరిగి గింజలన్నీ రాలిపోయాయి. వరి పంట నేలకొరగడం, వర్షం నీరు ఇంకా నిలిచి ఉండడంతో గింజలన్నీ తడిచి మొలకెత్తే ప్రమాదం ఉంది. మరోవైపు.. వర్షం కారణంగా తీత దశకు వచ్చిన పత్తి రాలిపోయింది. చెట్టు పై ఉన్న పత్తి కూడా మొలకెత్తే ప్రమాదం ఉంది. అదేవిధంగా నీటి మునిగిన పత్తి పనికివచ్చే అవకాశమే లేకుండా పోయింది. గురువారం సాయంత్రం వరకు కూడా వరి, పత్తి పంటల్లో నీరు ఇంకా అలాగే ఉంది. నీరంతా పోయేందుకు ఒకటి, రెండు రోజులు సమయం పట్టనుంది. ఈలోగా వరి, పత్తికి మరింత నష్టం కలగనుంది. జిల్లావ్యాప్తంగా వరి, పత్తి రైతులకు తీవ్ర నష్టం కలగనుంది.

తడిచిన ధాన్యం..

వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. టార్పాలిన్లు కప్పినా ఫలితం లేకుండా పోయింది. కొనుగోలు కేంద్రాలతో పాటు వ్యవసాయ బావులు, రోడ్ల వెంట పోసుకున్న ధాన్యం సైతం తడిసింది. పూర్తిగా ఆరిపోయి కాంటాకు సిద్ధంగా ఉన్న సమయంలో వర్షంతో ధాన్యంలో మళ్లీ తేమ పెరిగింది. ధాన్యం కుప్ప కింద నుంచి నీరు వెళ్లిసగానికి పైగా ధాన్యం తడిసింది. ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. గురువారం తెల్లవారుజామునే ధాన్యం కుప్పల వద్దకు రైతులు పరుగులు తీశారు. టార్పాలిన్లు తెచ్చి తడిసిన ధాన్యాన్ని, పొడి ధాన్యాన్ని వేరు చేసి ఆరబోశారు. ఎలాంటి షరతులు లేకుండా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. జఫర్‌ఘడ్ మండలం తిడుగులో పాత రోడ్డుపై ఓ రైతు వరి ధాన్యం సోయాబీన్ కుప్పలను పోసుకున్నారు. వాగు పొంగడంతో వరద నీటి ధాన్యం కొట్టుకొని పోయింది.


స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెంలో ..


జఫర్‌గడ్ మండలం తిమ్మంపేటలో నీట మునిగిన వరి పంట

అన్నదాతల్ని ఆదుకుంటాం : ఎమ్మెల్యే

పాలకుర్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ధాటికి పంటలు దెబ్బతిన్నాయని, బాధిత రైతులను అన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలో మొంథా తుఫాన్‌తో జరిగిన నష్టాన్ని గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులకు క్షేత్రస్థాయిలో సర్వే చేయాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడవడంతో ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. వర్షానికి కూలిన ఇండ్లు, వరి ధాన్యం, పత్తి పంటలను అధికారులు సర్వే చేసి అంచనాలు చేయాలని సూచించారు. విష్ణుపురి గ్రామంలోని కాలనీలోకి నీరు రావడంతో పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేశ్వరచారి, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు రవీందర్, వెంకటేశ్వరచారి ఉన్నారు.

పాలకుర్తి, దర్దెపల్లి మధ్యలో కల్వర్టుపై పారుతున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ధాన్యం కొనుగోళ్లపై కంట్రోల్ రూం ఏర్పాటు: కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో ఎదురయ్యే సమస్యలపై కలెక్టరేట్‌లో గురువారం కంట్రోల్ రూంను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం మిల్లుకు చేరేవరకు పర్యవేక్షణపై ఫిర్యాదుల పరిష్కారానికి కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కంట్రోల్ రూంలో ఫిర్యాదు స్వీకరిస్తారన్నారు. సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం నంబరు 8520991823 ని సంప్రదించగలరని తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి | రైతులకు భరోసా కల్పించాలి: కలెక్టర్

రఘునాథపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో అతలాకుతలమైన వ్యవస్థను చక్కదిద్దడానికి క్షేత్రస్థాయిలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై వరదతో వాహనాల రాకపోకలకు అంతరాయం కల్పించిన ప్రదేశాన్ని కలెక్టర్ గురువారం పరిశీలించారు. జాతీయ రహదారి పైకి వరద రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం నిడిగొండలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు తేమ శాతం వచ్చాకనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులు అధైర్యపడకుండా అధికారులు భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో వెస్ట్‌జోన్ జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్డీవో గోపిరామ్, తహసీల్దార్ ఫణికిషోర్, సిఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ డి.నరేష్ పాల్గొన్నారు.


రఘునాథపల్లిలోని హైవేపై పరిశీలిస్తున్న కలెక్టర్

నేడు సీఎం రాక

- నీట మునిగిన నగరంలో ఏరియల్ సర్వే
- పలు ప్రాంతాలను సందర్శించనున్న సీఎం
- కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులతో సమీక్ష



వివరాలు: 6లో

110 గొర్రెలు మృతి

- వరదలో కొట్టుకుపోయిన గొర్రెలు
- రూ.10లక్షల వరకు నష్టం
- వెల్దండలో ఘటన



వివరాలు: 8లో

ఆగమాగం

- నేలవాలిన పంటలు
- దెబ్బతిన్న రోడ్లు
- నిలిచిన రాకపోకలు
- తడిసిన ధాన్యం

వివరాలు: 8లో


స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరువాగు

వాగులో కొట్టుకుపోయిన ప్రేమజంట

- గల్లంతైన యువతి.. ప్రాణాలతో బయటపడిన యువకుడు
- కోనాయిచలం వైపు వస్తుండగా బోళ్ల మత్తడి వద్ద ఘటన
- యువతి కోసం రెస్క్యూ టీం గాలింపు

వివరాలు: 7లో


వాగులో గల్లంతైన యువతి శ్రావ్య

బచ్చన్నపేట పీఎస్‌ను తనిఖీ చేసిన ఏసీపీ



బచ్చన్నపేట పీఎస్‌లో రిజిష్టర్ పరిశీలిస్తున్న ఏసీపీ

బచ్చన్నపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌ను గురువారం ఏసీపీ నితిన్ చేతన్ తనిఖీ చేశారు. కానిస్టేబుల్స్ ఫిట్‌నెస్‌తోపాటు వారు వినియోగించే కిట్‌బాక్స్‌లు, పలు వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా పరేడ్‌ను నిర్వహించారు. మండల పరిధిలో క్రైం రేట్, ఆన్‌లైన్ వర్క్, కేసుల నమోదు విధానాన్ని పరిశీలించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, రక్షణ కల్పించేందుకు తామున్నామనే ధీమాను కలుగజేసేలా ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఏసీపీ వెంట సీఐ అబ్బయ్య, ఎస్ఐ అబ్దుల్ హమీద్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జనగామలో శాతవాహనకు హాల్టింగ్

బీజేపీ నాయకులు సంబరాలు

జనగామ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జనగామ రైల్వే స్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ ట్రైన్ గురువారం హాల్టింగ్ కావడంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ ఆధ్వర్యంలో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. జనగామ రైల్వే స్టేషన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి, రైల్వే డ్రైవర్లను ఘనంగా సత్కారించారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు హరిశ్చంద్ర గుప్త, శివరాజ్ యాదవ్, కొంతం శ్రీనివాస్, కీర్తి నర్సయ్య, సోమి రెడ్డి వెంకటరెడ్డి. పిట్టల సత్యం, దేవరాయల ఎల్లయ్య, కాసుల శ్రీనివాస్ పాల్గొన్నారు.


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మెరుగైన వైద్య సేవలందించాలి

డిప్యూటీ ట్రైనింగ్ కలెక్టర్ వెంకటరమణ


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డిప్యూటీ ట్రైనింగ్ కలెక్టర్ వెంకటరమణ

జనగామ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని డిప్యూటీ ట్రైనింగ్ కలెక్టర్ వెంకటరమణ అన్నారు. జనగామలోని ధర్మకంచ పీహెచ్‌సీని ఆయన గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీతేజ, సూపర్‌వైజర్ వి. రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడి రాజీనామా

గణపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బీజేపీ భూపాలపల్లి జిల్లా గణపురం మండల అధ్యక్షుడు ఊర నవీన్‌రావు రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటించారు. పార్టీలో తనదైన బాధ్యతను నిర్వర్తిస్తున్నప్పటికీ కొందరు నాయకులు తనకు సహకరించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కార్యవర్గానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో తన పదవికి రాజీనామా చేసినట్టు చేశానని, పార్టీ కార్యకర్తగానే కొనసాగుతానని తెలిపారు.

చర్చిలో అగ్ని ప్రమాదం

కృష్ణకాలనీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో ఉన్న ఐనోన్ చర్చిలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ మేరకు పాస్టర్ డేవిడ్ రాజు గురువారం తెలిపారు. బుధవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో చర్చి షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయని, తాము గ్రహించేలోపే పోడియం, మూడు ఫ్యాన్లు, స్టేజ్ లైట్స్, గ్రీన్ కార్పెట్, కూలర్, చైర్స్ తదితర సామగ్రి కాలిపోయాయనని వివరించారు. దీంతో రూ. లక్ష పైచిలుకు నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నర్మెట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన జనగామ జిల్లా నర్మెట మండలకేంద్రంలో బుధవారం సాయంత్రం జరిగింది. గురువారం ఎస్సై నగేష్ తెలిపిన కథనం ప్రకారం. జనగామ మండలం గానుగుపహాడ్‌కు చెందిన రెడ్డబోయిన శివకుమార్(23) గానుగుపహాడ్ గ్రామం నుంచి తన అత్తగారిల్లు నర్మెట మండలం ఆగాపేటకు వచ్చాడు. తిరిగి ప్రయాణంలో నర్మెట అంగడి సమీపంలో రోడ్డు మీద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో జనగామకు తరలించగా ప్రథమ చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి రెడ్డబోయిన సిద్దులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై నగేష్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జనగామ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి(60) మృతదేహానికి జనగామ ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచినట్లు సీఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. జనగామలోని కళ్లెం రోడ్డులో మృతి చెందగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంబంధీకులు 8712685202, 8712572132 ను సంప్రదించగలరని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


రజిత (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దండెంపై బట్టలు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మహిళ మృతిచెందిన ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బూర్ల రజిత (30) బట్టలు ఉతికి ఇంటిముందున్న రేకులషెడ్‌లో ఉన్న ఐరన్ జే వైర్ పై ఆరవేసేందుకు ఉపక్రమించింది. అప్పటికే ఇంట్లోకి విద్యుత్ సరఫరా అయ్యే సర్వీసు జే వైర్‌కు తగిలిఉండడాన్ని గమనించకుండా రజిత వచ్చి బట్టలు వేయడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. కుటుంబ సభ్యులు ఘన్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలంచగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె కలరు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథ తుఫాన్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం రాత్రి అకాలంగా కురిసిన వర్షాలతో మండలంలో పంటలు, రహదారులు, ఇళ్లు ధ్వంసం అయ్యాయి. అమ్మాపురం గ్రామ శివారు బొత్తలతండా వద్ద ధ్వంసమైన కల్వర్టు, గుర్తూర్-సోమారం గ్రామాల మధ్య ఉధృతం ప్రవహిస్తున్న ఈదులకుంటవాగును, గుర్తూర్‌లో నీటమునిగిన పంటలను గురువారం ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, నష్టం అంచనా వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్సై ఉపేందర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల కుమార్, కందాడి అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, పెద్దగాని సోమయ్య, మంగళిపల్లి రామచంద్రయ్య, ఎం.విక్రమ్‌రెడ్డి, మోత్కూరి రవీంద్రచారి, అరవింద్ పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతీ ఒక్కరిని ఆదుకుంటాం..

పెద్దవంగర(ఆంధ్రజ్యోతి): మొంథ తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గ ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, ముంపుప్రాంతాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మండల కేంద్రం జలదిగ్బంధంలో ఉండిపోయింది. వరద ప్రవాహం దాటికి దెబ్బతిన్న వ్యవసాయ పొలాలను ఆయా శాఖల అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నష్టపోయిన ప్రతీ ఒక్కరిని అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుటుందన్నారు. నష్టం అంచనా వేసి ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో గ్రామాల్లోని నాయకులు, ప్రజాప్రతినిధులు బాధితులకు అండగా నిలిచి చేయూతనివ్వాలన్నారు. తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఎంపీడీవో వేణుమాధవ్, ఆర్ఐ లష్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, రంగు మురళి, వెంకన్న, రవీందర్‌రెడ్డి, దేవేంద్ర, ఉప్పలయ్య, లింగమూర్తి, సీతారామ్, హరికృష్ణ, సోమన్న, సంపత్, సైదులు, శ్రీనివాస్, మంజుల, వినోద్, సమ్మయ్య, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దవంగరలో నీటి ప్రవాహంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


గుర్తూర్‌లో నీట మునిగిన వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలేరు వాగు వద్ద బారికేడ్లు

దంతాలపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దముప్పారం గ్రామ శివారు పాలేరు వాగు రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో స్థానిక ఎస్సై పిల్లల రాజు ఆధ్వర్యంలో భారీ బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉందన్నారు. రైతులు, ప్రయాణికులు వాగులు దాటేందుకు సాహసం చేయొద్దన్నారు. 24 గంటల పాటు పోలీసు సిబ్బంది, ఆయా గ్రామాల జీపీ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. దీంతో సూర్యాపేట-దంతాలపల్లికి ఆర్టీసీ సౌకర్యాన్ని నిలిపివేశారు. కుమ్మరికుంట్ల వద్ద పాలేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో పంచాయతీ కార్యదర్శి సృజన పలు సూచనలు చేశారు.

'నష్టం నివేదికను పంపిస్తాం'

దంతాలపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మూడు రోజులుగా కురుస్తోన్న తుఫాన్ వల పంటలకు తీవ్ర నష్టం జరిగిందని, రైతులకు న్యాయం జరిగేందుకు ప్రభుత్వానికి నివేదికను పంపిస్తామని ఏవో వాహిని అన్నారు. గురువారం ఆమె ఆధ్వర్యంలో మండలంలోని ఆగపేట, నిదానపురం, పెద్దముప్పారం, తూర్పుతండా, గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 గ్రామాల్లోని రైతుల పొలాలను ఉన్నతాధికారుల సూచన మేరకు పరిశీలించి నిదికను తయారు చేస్తామన్నారు. మరో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. సాహసం చేసి వాగులు, వంకలు దాట్వొన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు దీక్షిత్‌కుమార్, ఉదయ్‌కిరణ్, శిరీష పాల్గొన్నారు.

ఉప్పొంగిన ఆకేరు వాగు

- ఆందోళన చేపట్టిన గిరిజనులు
- గత ఏడాది సీఎం ఇచ్చిన హామీలు వట్టిమాటేనా..

మరిపెడ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఆగస్టులో కురిసిన తుఫాన్ తాకిడి నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఆకేరు పరివాహక ప్రాంతాలైన పురుషోత్తమాయగూడెం శివారు సీతారాం తండా, ఉల్లేపల్లి, బీచ్‌రాజ్‌పల్లి, భూక్యా తండాలలో బుధవారం ఉదయం మొదలై సాయంత్రం వరకు కురిసిన మొంథా తుఫాన్‌తో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. గురువారం ఉదయం ఒక్కసారే ఆకేరు వాగు ఉప్పొంగడంతో సీతారాం తండా వాసులు పురుషోత్తమాయగూడెం వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వద్ద రెండు గంటల పాటు ఆందోళన చేపట్టారు.

జాతీయ రహదారిపై గిరిజనుల ఆందోళన

సీతారాం తండాకు సమీపంలో ఉన్న ఆకేరు వాగు ఉధృతి పెరగటంతో తండా వెనుక వైపు పంట చేలల్లో నీళ్లు చేరాయి. అదే విధంగా జాతీయ రహదారి 365పై నుంచి తండాకు వచ్చే దారిలో నీరు రోడ్డుపైకి చేరుతుండడంతో మరోసారి ఏం జరుగుతుందోనన్న భయాందోళనలతో తండా వాసులు ప్రధాన రహదారిపైకి వచ్చి అధికారుల కోసం ఎదురు చూస్తున్నారు. జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్ బంక్ వద్ద పశువులను కట్టేసి.. రాత్రంతా జాగారం చేసినట్లు తండా వాసులు పేర్కొన్నారు..

సీఎం రేవంత్‌రెడ్డి హామీలు వట్టిమాటలేనా..

గత ఏడాది వచ్చిన అకాల వర్షాలకు తమ తండా మొత్తం మునిగిపోయింది. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి స్వయాన తండాకు వచ్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గురువారం తెల్లవారుజాము నుంచి వరద ఉధృతి పెరిగినా అధికారులు ఎవరూ మమ్మల్ని సంప్రదించలేదని తండా వాసులు వాపోయారు.స్థానిక ఎమ్మెల్యే రామచంద్రునాయక్, ప్రభుత్వం చొరవ తీసుకుని తండాకు సమీపంలో ఆకేరు వాగుకు దూరంలో 64 ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామన్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లను కట్టించాలని డిమాండ్ చేశారు.దీంతో తహసీల్దార్ కృష్ణవేణి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూస్తున్నామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

- తొర్రూరు రూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలో మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంది. అమ్మాపురంలో చేతికి వచ్చిన వరి పంట నీట మునిగిపోయి వరద ప్రవహిస్తోంది. సోమారం గ్రామంలో ఒక ఇల్లు, అమ్మాపురం గ్రామాల్లో ఇల్లు కూలిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఈదులకుంటతండా వద్ద వరద ఉధృతంగా ప్రవహించడంతో నర్సంపేట-తొర్రూరు రాకపోకలు నిలిచిపోయాయి. కంఠాయపాలెం గ్రామం నుంచి కస్నాతండాకు వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. కొమ్మనపల్లితండాలో రహదారి పూర్తిగా ధ్వంసమైంది. గుర్తుర్-కంఠాయపాలెం మధ్య వరద ఉధృత్తితో రాకపోకలు నిలిచిపోయాయి. వెంకటాపురం గ్రామంలో గాలివానకు విద్యుత్ స్తంభం విరిగి గాదెగాని వెంకన్న ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. మండల వ్యాప్తంగా 1500 హెక్టార్లలో పంటల నష్టం అంచనా వేసినట్లు తెలిపారు. నాంచారిమడూరు, వెల్లికట్టె గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఎస్‌వో ప్రేమ్‌సాగన్, డీఎం కృష్ణవేణి పరిశీలించారు.


పురుషోత్తమాయగూడెం వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు


అమ్మాపురంలో వరి పంటలో నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

- నీట మునిగిన నగరంలో ఏరియల్ సర్వే
- పలు ప్రాంతాలను సందర్శించనున్న సీఎం
- కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలతో సమీక్ష

నేడు సీఎం రాక..

వరంగల్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మొంథా తుఫాన్‌తో జలమయమైన వరంగల్ నగరాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందర్శించనున్నారు. తుఫాన్‌తో వరంగల్ నగరంలోని అనేక కాలనీలు నీటమునగగా రోడ్లు, పంటలు భారీగా దెబ్బతిన్నాయి. ఈక్రమంలో గురువారం జిల్లా అధికారులు మంత్రి కొండా సురేఖతో కలిసి వర్షాల కారణంగా జరిగిన నష్టాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూనే శుక్రవారం వరంగల్ నగరాన్ని సందర్శించనున్నట్లు సీఎం పేర్కొన్నారు. తొలుత వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని పలు ప్రాంతాలను ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. అనంతరం హనుమకొండ, వరంగల్ పట్టణాల్లోని నీట మునిగిన పలు కాలనీలను సీఎం సందర్శించి బాధితులతో మాట్లాడనున్నారు. లోతట్టు ప్రాంతాల్లో బాధితులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను సీఎం పరిశీలించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షించనున్నారు. నగరంలో వరదలకు, లోతట్టు ప్రాంతాలు నీటమునగడానికి గల కారణాలపై సమీక్షించనున్నారు. భవిష్యత్‌లో వరంగల్ నగరానికి వరద ముప్పు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులతో చర్చించనున్నారు. ఇప్పటికే నగరంలో రూ.5170కోట్లతో అండర్ డ్రైనేజీ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ పనులకు సంబంధించిన పురోగతిపై సీఎం చర్చించనున్నారు. కాగా, సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. అయితే సీఎం పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

వీసీ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

జనగామ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ రైతులకు అండంగా నిలువాలని వీసీ(వీడియో కాన్ఫరెన్స్) ద్వారా సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల జిల్లా కలెక్టర్లతో గురువారం డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కొండ సురేఖ, వాకటి శ్రీహరి, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జనగామ కలెక్టరేట్ కార్యాలయం నుంచి కలెక్టర్ రిజ్వాన్ బాషా, సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ తుఫాన్ ప్రభావిత జిల్లా ఇన్‌చార్జీ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. 16 జిల్లాలకు తుఫాన్ ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సెలవులను రద్దు చేయాలన్నారు. అవసరమైన చోట్ల వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలుపై స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. ధాన్యం కొనుగోలుపై కలెక్టర్ సంబంధిత అధికారులతో వీసీ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు నష్టం కాకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలన్నారు. నవంబరు మొదటి వారంలో మరింత ధాన్యం వచ్చే అవకాశం ఉందని ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయిలో వేగవంతం జరగాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కంట్రోల్ రూమ్ నంబర్లను ఏర్పాటు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

సింగరేణి సీఎండీ వీడియో కాన్ఫరెన్స్

కృష్ణకాలనీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో జరుగతున్న విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా దాని ప్రాముఖ్యతపై ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ నాయక్ గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూపాలపల్లి ఏరియా అధికారులతో మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించకుంటూ పారదర్శక సేవలు అందించడం ద్వారా అవినీతిని కట్టడి చేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు. విజిలెన్స్ అంటే ప్రతి ఒక్కరినీ నేరస్థులుగా చూడ్డం కాదని స్పష్టం చేశారు. నేరం జరగకుండా వ్యవస్థను పకడ్బందీగా నిర్వహించడమేనని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, ఎస్‌వోటూ జీఎం కవీంద్ర, అధికారులు ఎర్రన్న, జ్యోతతి, రవీందర్, రాజేశ్వర్, శైలేంద్రకుమార్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ములుగు రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడి గేదే మృతి చెందిన సంఘటన ములుగు మండలం జగ్గన్నపేట గ్రామపంచాయితీ పరిధి సారంగపల్లిలో గురువారం చోటుచేసుకుంది. బాధిత రైతు అజ్మీరా అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం ఇంటి నుంచి మేతకు వెళ్లిన గేదె గ్రామంలోని ఆశ్రమ కళాశాల ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం ఎర్త్ వైర్లు తగిలి షాక్‌కు గురై మృతి చెందింది. దీంతో రూ. 60 వేలు నష్టం జరిగిందని అనిల్ తెలిపాడు.

మేడిగడ్డ బ్యారేజీకి స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. మొంథా తుఫాన్ ప్రభావంతో ఇన్‌ఫ్లో నెమ్మదిగా పెరుగుతోంది. నెలరోజులుగా బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 1.23లక్షల క్యూసెక్కులుగా ఉండగా, గురువారం 1.75లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. బ్యారేజీ వద్ద 3 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోంది.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

మల్హర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా మల్హర్ మండల కేంద్రమైన తాడిచర్లలో గురువారం చోటు చేసుకుంది. కొయ్యూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం జడల్‌పేట గ్రామానికి చెందిన గొడిశెల విజయేందర్(30) కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 27న అతడితో గొడవ పడిన భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై న విజయేందర్ ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతడి భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

'మంథని'లో అభివృద్ధి కాంతులు

- నియోజకవర్గంపై మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక ఫోకస్
- ఇప్పటికే అనేక పనులకు శ్రీకారం
- చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై దృష్టి
- గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ప్రణాళిక

మహదేవపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మంథని నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. అనేక ఏళ్లుగా తిష్ట వేసిన సమస్యలకు పరిష్కారం లభిస్తోందని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రగతి వైపు పరుగులు పెడుతున్నామని అంటున్నారు ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ మంత్రిగా కొనసాగుతున్న దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృషితో చిన్న కాళేశ్వరం పనులకు రూ.513 కోట్లకు పైగా నిధులు వెచ్చిస్తున్నామని అంటున్నారు. నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ, ఇతర అభివృద్ధి పనులను ముమ్మరం చేసినట్టు తెలిపారు. అలాగే సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో సమర్థంగా అమలు చేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు అంటున్నారు. ముఖ్యంగా సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి ఇతరత్రా పథకాలతో పేదలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

- గోదావరి పుష్కరాలకు రూ. 200 కోట్లు

గోదావరి పుష్కరాలు 2027లో జరగనున్న నేపథ్యంలో రూ. 200 కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. కొన్ని నెలల క్రితం జరిగిన సరస్వతీ పుష్కరాలకు రూ.33 కోట్లు కేటాయించారు.

చిన్న కాళేశ్వరం పనులకు నిధులు

రైతులకు సాగు నీరు అందించే చిన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను పునఃప్రారంభించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి సారించారని తెలుస్తోంది. పదేళ్ల క్రితం అర్థంతరంగా ఈ ప్రాజెక్టు పనులు ఆగిపోగా దానిని పూర్తి చేయడానికి రూ. 513 కోట్లు వెచ్చిస్తున్నారు. అంతేకాకుండా గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, విస్తరణ పనులు చేపట్టి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరుస్తున్నామని మంత్రి తెలిపారు.


మహదేవపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు (ఫైల్)

-కాళేశ్వరాలయ అభివృద్ధికి కృషి

శ్రీధర్‌బాబు స్వగ్రామం భూపాలపల్లి జిల్లా కాటారం మండల పరిధి ధన్వాడ. మాజీ మంత్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు తనయుడు ఆయన. తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలకు అనునుణంగా ప్రజా సేవ చేయడమే తన కర్తవ్యమని అంటున్నారు శ్రీధర్‌బాబు. మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరాలయం నిర్మాణంలో తండ్రి శ్రీపాదరావు ప్రధాన పాత్ర పోషించారని స్మరించుకున్నారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా కాళేశ్వరాలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని అంటున్నారు. ఇందులో భాగంగా గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతున్నానని తెలిపారు.

వరదనీళ్లలో ఓరుగల్లు


జలమయమైన హంటర్‌రోడ్‌లోని భద్రకాళి బండ్ జంక్షన్


చిన్నారులను తరలిస్తున్న రెస్క్యూ సిబ్బంది


గోపాల్‌పూర్ చెరువు వరద నీరు ముంచెత్తడంతో జవహర్ కాలనీలో వరదనీటి మధ్యలో ఇళ్లు


జవహర్‌కాలనీలో నీటిలో మునిగిన కారు


పెద్దమ్మగడ్డ నాలా వద్ద వరదనీరు ప్రవహిస్తుండడంతో భారీగా పేరుకుపోయిన వాహనాలు


భారీ వర్షానికి వరంగల్ నగరంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న నాలా, వరదనీటిలో మునిగిపోయిన పలు కాలనీలు

మృత్యు వరద

మొంథా తుఫాన్‌తో ఉమ్మడి జిల్లాలో ఆరుగురి మృతి

మొంథా తుఫాన్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర ప్రభావం చూపింది. వర్షానికి పలు ప్రాంతాల్లో ఆరుగురు మృత్యువాత పడ్డారు.

వరదనీటిలో చిక్కుకుని వృద్ధుడి మృతి


ఆడెపు క్రిష్ణమూర్తి

వరంగల్‌సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో 14వ డివిజన్ ఎస్‌ఆర్‌నగర్‌లో ఆడెపు క్రిష్ణమూర్తి(70) అనే వృద్ధుడు కాలికి గాయమవడంతో వరదనీటి నుంచి బయటకు రాలేకపోయి తాను ఉంటున్న ఇంటిలోనే మృతి చెందాడు. మృతుడి భార్య కొవిడ్ సమయంలో మృతి చెందిం ది. అతడికి పిల్లలు లేరు. ఒక్కడే నివాసముంటున్నాడు. కాగా గురువారం ఉదయం స్థానిక నాయకుడు కేతిరి రాజశేఖర్ చూసి పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

చావుకు వెళ్లి వస్తూ.. వరద నీటిలో గల్లంతు ..


పులి అనిల్(ఫైల్)

ఖిలావరంగల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బంధువు దహన సంస్కారాలకు వెళ్లి వస్తున్న క్రమంలో నగరంలోని మైసయ్యనగర్ వద్ద వరదలో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. మిల్స్‌కాలనీ పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గీసుగొండ మండలం గుట్టకిందిపల్లి ప్రాంతానికి పులి అనిల్‌కుమార్ (30)బుధవారం రాత్రి తన భార్య మమతతో కలిసి శాకరాసికుంటలో తమ బంధువు దహన సంస్కారాలకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా భారీగా వర్షం కురవడంతో ఖమ్మం రోడ్డు వద్ద తన భార్యను బస్సులో ఎక్కించాడు. ఆయన అదే రోడ్డు గుండా మైసయ్యనగర్ ద్వారా గీసుగొండకు వెళ్తున్న క్రమంలో దారి కనిపించక నీళ్లలో పడి గల్లంతయ్యాడు. మృతుడి భార్య మిల్స్‌కాలనీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వెతుకుతున్న క్రమంలో శివనగర్‌లోని పెద్ద మోరీలో మృతుడి శవం కనిపించింది. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మిల్స్‌కాలనీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు కూలి వృద్ధురాలి మృతి


మృతిచెందిన వృద్ధురాలు సూరమ్మ

ఐనవోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇళ్లు కూలి వృద్ధురాలు మృతిచెందిన సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తిలో గురువారం చోటుచేసుకుంది. అదనపు గిర్దావర్ మల్లయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండపర్తి గ్రామానికి చెందిన వృద్ధురాలు గద్దల సూరమ్మ (60) భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. పెంకుటింట్లో ఒంటరిగా పడుకొని ఉండగా గురువారం తెల్లవారుజామున ఇల్లు గోడ కూలి అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్థులు మట్టిలో కూరుకపోయిన సూరమ్మను బయటికి తీశారు. ప్రాణ నష్టంతోపాటు ఆస్తి నష్టం రూ.1.25 లక్షలు జరిగినట్లు అంచనా వేశారు.

మొట్లతండాలో రైతు గల్లంతు


సంపత్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లి శివారు మొట్లతండా వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగులో రెడ్యాల గ్రామానికి చెందిన పులిగుజ్జు సంపత్ (30) బుధవారం రాత్రి గల్లంతయ్యాడు. ఎన్డీఆర్ఎఫ్, మానుకోట రూరల్ పోలీసులు, గ్రామస్థులు కలిసి వెతకగా మొట్లతండా సమీపంలో గురువారం పొలాల్లో రైతు మృతదేహం లభ్యమైంది. గ్రామస్థులు, రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలం రెడ్యాలకు చెందిన పులిగుజ్జు సంపత్ బుధవారం గురిమిళ్ల నుంచి రెడ్యాలకు వస్తున్నాడు. ఈ క్రమంలో కంబాలపల్లి-మొట్లతండా మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్న వాగులో పడి పోయాడు. ఎంతకు ఇంటికి రాకపోవడంతో సంపత్ కుటుంబ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాగులో ఒకరు కొట్టుకు పోయారని కంబాలపల్లికి చెందిన ఓ రైతు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గురువారం ఉదయం వారు ఎన్డీఆర్ఎఫ్ బృందంతో కలసి వాగు సమీపంలో వెతికారు. దగ్గరలోని పంట పొలాల్లో సంపత్ మృతదేహం లభ్యమైంది. సంపత్ భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి మృతి


రిటైర్డు ఉద్యోగి శ్రీనివాస్ (ఫైల్)

హనుమకొండ టౌన్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): హనుమకొండ టీవీ టవర్‌కాలనీకి చెందిన పాక శ్రీనివాస్(63) ఇంటి ముందు వరదలో పడి మృతి చెందాడు. గురువారం ఉదయం 10గంటలకు భార్య శ్రీదేవి, కొడుకు శ్రీకాంత్ ఇంట్లో ఉండగా, వరద ప్రవాహం ఇంటిగేటు వద్ద చూస్తుండగా వరదలో పడి మునిగి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు మృతదేహానికి శుక్రవారం పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వరదలో కొట్టుకుపోయి వ్యక్తి మృతి


అప్పని నాగేంద్రం (ఫైల్)

భీమదేవరపల్లి, (ఎల్కతుర్తి) అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భీమదేవపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అప్పని నాగేంద్రం (58) అనే వ్యక్తి కల్వర్టు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి ప్రవాహంలో చిక్కుకుని మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగేంద్రం హనుమకొండలోని ఓ ప్రైవే టు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో వర్షం మరింత పెరిగింది. దీంతో గ్రామంలోకి వెళ్లే కల్వర్టు పూర్తిగా జలమయమైంది. కల్వర్టు దాటే ప్రయత్నం చేశాడు. ఆయనకు నీటి ప్రవాహం సరిగా కనబడకపోయే సరికి కల్వర్టులో చిక్కుకుని మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, ఇద్దరుకుమారులు ఉన్నారు. అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

అన్నదాత.. గుండె కోత..

- మొంథా తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంటలకు తీరని నష్టం
- కన్నీరుమున్నీరవుతున్న రైతన్న

మొంథా తుఫాన్ అన్నదాతను నట్టేట ముంచింది. అకాల వర్షానికి పంటలన్నీ నేలపాలయ్యాయి. కోతకు దగ్గరపడ్డ వరి నీళ్లలో మునిగిపోయింది. పత్తి దూది తడిసిపోయింది. మొక్కజొన్న పంట ధ్వంసమైంది. ఒక్క రోజులో కురిసిన వర్షానికి రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ములుగులో..


ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన వరి పంటను కట్టలు కట్టి నిలబెడుతున్న రైతు

ములుగు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ములుగు జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు సగటు వర్షపాతం 4.14 సెం.మీ నమోదైందని అధికారులు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 600 ఎకరాల్లో వరి పంట నేల వాలినట్లు డీఏవోసురేష్ కుమార్ తెలిపారు. అత్యధికంగా గోవిందరావుపేట మండలం, మంగపేట మండలాల్లో వరి పంట నేటకొరిగిందన్నారు. భారీ వర్షం కురవకపోవడంతో పంట నష్టం పెద్ద మొత్తంలో లేదని, ఈదురుగాలులు వల్ల వరి వంగడాలు నేలకొరిగాయని అన్నారు. వాటిని కట్టలు కట్టి ఆరబెడితే ప్రయోజనం ఉంటుందని సూచించారు.


ములుగు జిల్లా వాజేడు మండలంలో నేలవాలిన వరి పంట

జనగామలో..

జనగామ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లావ్యాప్తంగా బుధవారం నాటి తుఫాన్ అన్నదాతకు నష్టాన్ని మిగిల్చింది. భారీ వర్షాలతో జిల్లాలో చాలా చోట్ల వరి, పత్తి పంటలు నీటిమునిగాయి. జిల్లాలో 25816 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఇందులో వరి 1,9131 ఎకరాల్లో, పత్తి 6416ఎకరాల్లో, మొక్కజొన్న 249 ఎకరాల్లో, టమాట, మిర్చి 20ఎకరాల్లో నష్టం జరిగింది. జిల్లావ్యాప్తంగా 142 గ్రామాల పరిధిలోని 9,888 మంది రైతులకు సంబంధించి రైతులు పంటలు నష్టపోయారని అధికారులు గుర్తించారు. చాలా ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరి నేలకొరిగి గింజలన్నీ రాలిపోయాయి. మరో వైపు.. తీత దశకు వచ్చిన పత్తి రాలిపోయింది. చెట్టుపై ఉన్న పత్తి కూడా మొలకెత్తే ప్రమాదం ఉంది. కేంద్రాల్లో ధాన్యాన్ని పోసి టార్పాలిన్లు కప్పినప్పటికీ కుప్పల కింద నుంచి వర్షపు నీరు ప్రవహించి ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాలతో పాటు వ్యవసాయ బావులు, రోడ్ల వెంట పోసుకున్న ధాన్యం సైతం తడిసి ముద్దయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. గురువారం తెల్లవారుజామునే ధాన్యం కుప్పల వద్దకు రైతులు పరుగులు తీశారు. టార్పాలిన్లు తెచ్చి తడిసిన ధాన్యాన్ని, పొడి ధాన్యాన్ని వేరు చేశారు.


జనగామ మండలం వడ్లకొండ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

భూపాలపల్లిలో..


భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం వజినేపల్లిలో తడిసిపోయిన పత్తి పంట

భూపాలపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో భూపాలపల్లి జిల్లాలోని 12 మండలాల్లో పత్తి పంట తీవ్రంగా దెబ్బతినగా కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, పలిమెల, మల్హర్ మండలాల్లో పొట్ట దశలో ఉన్న వరి పంట ఈదురుగాలుల తాకిడికి నేలవాలింది. అయితే.. అధికారికంగా ఎక్కడా ఎలాంటి పంట నష్టం వాటిల్లలేదని అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ కాటారం సబ్ డివిజన్ పరిధిలోని 500 ఎకరాలకు పైగా వరి పంటకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కాటారం, మహదేవపూర్ మండలాల్లో భారీ వర్షానికి తోడు ఈదురుగాలలు వీచడంతో వరి పంట మొత్తం నేలమట్టమైంది. దీంతో ఆయా మండాల్లో రైతులు గురువారం వర్షం తెరిపినిచ్చిన తర్వాత వాటిని నిలబెట్టే ప్రయత్నాలు చేశారు. మరోవైపు చేతికందే దశలో ఉన్న పత్తి, వర్షం దెబ్బతో పూర్తిగా తడిసిపోవడంతో రంగు మారిందని రైతులు చెబుతున్నారు. జిల్లాలో ఎంత నష్టం వాటిల్లిందనేది అధికారులు సర్వే చేస్తే తప్ప తెలిసే అవకాశం లేదంటున్నారు.

మహబూబాబాద్‌లో..

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ రైతులను తీవ్రంగా నష్ట పరిచింది. భారీ వర్షాలు జిల్లా రైతులను కన్నీటిపాలు చేసింది. చేతికొచ్చిన పంట వానపాలైంది. వరికోత దశలో ఏకధాటిగా కురిసిన వర్షాలతో భారీ నష్టాన్ని మిగిల్చింది. పత్తి పూత, కాత దశలో భారీ వర్షాలు పడి నష్టాన్ని మిగిల్చగా, ఉన్న కొద్దిపాటి పంటను కాపాడుకుందామనుకుంటే అతిభారీ వర్షాలు కురిశాయి. దీంతో రైతులు భారీ మొత్తంలోనే నష్టపోవాల్సి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంటల నష్టాన్ని అంచనా వేయాలని ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా యంత్రాంగం అంచనా వేసేందుకు కదిలారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 217 గ్రామాల్లో 15,614 మంది రైతులకు చెందిన 16,617 ఎకరాల్లో వరికి నష్టం జరిగింది. 8,782 ఎకరాల్లో పత్తి, 65 ఎకరాల్లో మొక్కజొన్న, 565 ఎకరాల్లో మిర్చివెరసి 26,029 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల తెలిపారు. 2408.1 మిల్లీమీటర్ల వర్షపాతం కురియగా, సగటున 150.5 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది.


కేసముద్రం మండలం తౌర్యతండాలో రైతు చంద్రుకు చెందిన నేలవాలిన పత్తి చేలు

వాగులో కొట్టుకుపోయిన ప్రేమజంట



- గల్లంతైన యువతి.. ప్రాణాలతో బయటపడిన యువకుడు
- స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి జఫర్‌గడ్ వైపు వస్తుండగా ఘటన
- యువతి కోసం రెస్క్యూ టీం గాలింపు


ప్రాణాలతో బయటపడిన యువకుడు శివకుమార్

జఫర్‌గడ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం కోనాయిచలం శివారు బోళ్ల మత్తడి వాగులో వరద ఉధృతికి ఓ ప్రేమజంట కొట్టుకు పోగా, ఇద్దరిలో బక్క శ్రావ్య (18) గల్లంతు కాగా, ఆమె వెంట ఉన్న బరిగెల శివకుమార్ యువకుడు ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటకు చెందిన బక్క అలిసాబ్ - పూర్ణ దంపతులు ముగ్గురు కుమార్తెలు. చిన్నకుమార్తెతో కలిసి 20 ఏళ్లుగా హైద్రాబాద్‌లోని ఓ ఫౌల్ర్టీఫాంలో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. రెండో కుమార్తె శ్రావ్య వరంగల్‌లోని ఉమెన్ హాస్టల్‌లో ఉంటూ ఖిలావరంగల్ పరిధిలోని బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. యువతి తల్లిదండ్రులు పనిచేస్తున్న ఫౌల్ర్టీ ఫాంలోనే పని చేస్తున్న రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లికి చెందిన బరిగెల శివకుమార్‌తో శ్రావ్య మధ్య పరిచయం పెరిగి ప్రేమగా మారింది. బుధవారం హైద్రాబాద్ నుంచి బైక్‌పై వచ్చిన శివకుమార్ శ్రావ్య ఉంటున్న హాస్టల్‌కు చేరుకున్నాడు. అక్కడినుంచి తన బైక్‌పై జఫర్‌గడ్ మండలం కోనాయిచలంలోని స్నేహితుడి ఇంటికి శ్రావ్యను తీసుకుని స్టేషన్‌ఘన్‌పూర్, తిమ్మంపేట మీదుగా వస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి 10 గంటల ప్రాంతంలో జఫర్‌గడ్ మండలం బోళ్లమత్తడి వద్ద ప్రధాన బీటీ రోడ్డుపై నుంచి వాగు దాటే ప్రయత్నంలో శివకుమార్- శ్రావ్యలు వరద ఉధృతికి బైక్‌తో సహా వాగులో కొట్టుకుపోయారు. శ్రావ్య గల్లంతు కాగా, శివకుమార్ ఓచెట్టును పట్టుకుని ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. రాత్రి జఫర్‌గడ్ పోలీసుస్టేషన్‌లో ఘటనాసమాచారం తెలుపగా.. వెంటనే పోలీసులు వరంగల్ ఎస్‌ఆర్‌డీఎఫ్ రెస్క్యూటీం సిబ్బందిని ఘటనా స్థలికి రప్పించి గల్లంతైన శ్రావ్య కోసం వాగులో గాలింపు చేపట్టారు. ఘటనా స్థలికి జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ చేరుకుని గాలింపు చర్యలను పరిశీలించారు. వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న నాయక్, సీఐ శ్రీనివాసరావు, జఫర్‌గడ్ ఎస్‌ఐ రామారావు ఘటనా స్థలి వద్ద గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు. కాగా, సాయంత్రం వరకు యువతి ఆచూకీ లభించలేదు.

మిన్నంటిన రోదనలు


రోదిస్తున్న యువతి కుటుంబీకులు

ఘటనా స్థలి వద్దకు గురువారం చేరుకున్న యువతి తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కూతురును తలుచుకుంటూ భోరున విలపిస్తుండడం స్థానికులను కంటతడిపెట్టించాయి. తాము జీవనోపాధి కోసం సుమారు 20 ఏళ్ల కిందట హైద్రాబాద్‌కు వెళ్లి ఫౌల్ర్టీ ఫామ్‌లో పని చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. తాము బంధువు అంత్యక్రియల కోసం బుధవారం ఖిలావరంగల్‌కు వచ్చామని, గురువారం ఉదయం కూతురు వాగులో గల్లంతైన విషయం తెలిసిందని తండ్రి అలీసాబ్ విలపిస్తూ చెప్పాడు. శ్రావ్య వరంగల్‌లోని హాస్టల్‌లో ఉంటూ బొల్లికుంట వద్ద గల వాగ్దేవి కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతోందని, అమ్మాయి హైద్రాబాద్‌కు వెళ్లిన విషయం తమకు తెలియదన్నారు.

వెల్దండిలో 110 గొర్రెలు మృతి

నర్మెట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వెల్దండలో చెరువు మత్తడి ఉధృతి పెరిగి వరదలో చిక్కుకొని 110 గొర్రెలు బుధవారం సాయంత్రం మృతి చెందాయి. అధికారులు, బాధిత రైతు కథనం ప్రకారం. వెల్దండకు చెందిన పంతెంగి చంద్రమౌళికి చెందిన 110 గొర్రెలు, వడాల పెద్దపురంనకు చెందిన 150 గొర్రెలను మేత కోసం గ్రామంలోని గంటెమ్మ చెరువు సమీపం వైపువెళ్లారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేని వర్షంతో చెరువు మత్తడి ఉధృతంగా ప్రవహించింది. సాయంత్రం సమయంలో గొర్రెలను ఇంటికి తొలుకువస్తున్న క్రమంలో వరదలో 110 గొర్రెలు కొట్టుకుపోయి మృత్యువాతపడ్డాయి. గురువారం మృతి చెందిన గొర్రెలను గ్రామస్తులు బయటకు తీసి రెవెన్యూ, వెటర్నరీ అధికారులకు సమాచారం అందించారు. మండల పశువైద్యాధికారి గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. సుమారు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.


అలుగు పోస్తున్న బచ్చన్నపేట గుడి చెరువు

మత్తడిపోస్తున్న చెరువులు


అలుగుపోస్తున్న ఘన్‌పూర్ రిజర్వాయర్

బచ్చన్నపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి మండలంలోని చెరువులు, కుంటలు అలుగులు పోస్తున్నాయి. పోచన్నపేట వాగు ఉధృతంగా ప్రవహించటంతో మధ్యమధ్యన నిర్మించిన చెక్‌డ్యాంలు నిండి నీటితో కళకళలాడుతున్నాయి.

▸ స్టేషన్‌ఘన్‌పూర్: సముద్రాల గ్రామంలోకి వెళ్లే రోడ్డు పైన గల కల్వర్టు మీదుగా వెళ్లే వరద 24గంటల గడిచినా వరద ఉధృతి తగ్గడం లేదు. చెరువులు మత్తడిపడడంతో వచ్చే వరదనీరు కల్వర్టు మీదుగా వెళ్తుండడంతో సముద్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్‌కు భారీ వరద రావడంతో బుధవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా అలుగుపోస్తుంది.

కొట్టుకుపోయిన తాత్కాలిక బ్రిడ్జి


కొట్టుకుపోయిన గానుగుపహాడ్ బ్రిడ్జి

జనగామ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో జనగామ మండలంలో భారీ వర్షాలు కురిశాయి. మండలంలోని గానుగుపహాడ్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో జనగామ నుంచి నర్మెట, తరిగొప్పుల, హుస్నాబాద్, కరీంనగర్‌లకు రాక పోకలు తీవ్ర అంతరాయం ఏర్పాడింది. సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్సై రాజేశ్ కుమార్ బ్రిడ్జి వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి వడ్లకొండ మీదుగా వాహనాలు మళ్లించారు. చీటకోడూర్ రిజర్వాయర్ నాలుగు గేట్లు ఎత్తివేయడంతో చీటకోడూర్, చౌడారం,మరిగడి, మండెలగూడెం, గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తడిసిన ధాన్యాన్ని సర్కారే కొంటుంది..


సమస్యలను తెలుసుకుంటున్న శివరాజ్

జనగామ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తడిసిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని గురువారం పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు అధైర్య పడవద్దని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి జీవన్ కుమార్, ఏఈవో అనిల్, సీసీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పాలకుర్తిలో నేలవాలిన వరి


ఇప్పగూడెంలో నీట మునిగిన పత్తి..


వీఎస్‌ఆర్‌నగర్ వద్ద నేలకొరిగిన వరి


తిడుగులో కొట్టుకుపోతున్న సోయాబీన్

ఆగమాగం

● నేలవాలిన పంటలు ● దెబ్బతిన్న రోడ్లు ● నిలిచిన రాకపోకలు ● తడిసిన ధాన్యం

పాలకుర్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో అన్నదాతల్ని ఆగం చేసింది. వరి పంట, పత్తి పంట దెబ్బతింది. గురువారం పాలకుర్తి, దర్దెపల్లి గ్రామాల లోలెవల్ కాజ్‌వేపై నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో రాకపోకలు నలిచిపోయాయి. వల్మిడి, ముత్తారం గ్రామాల మధ్య వంతెన తెగిపోయింది. బమ్మెర, దుబ్బతండా మధ్య లోలెవల్ వంతెన కూడా తెగిపోయింది. దీంతో నీటి ప్రవాహం ఆగలేదు. అయ్యంగారిపల్లిలో కడుదూరి బాబుకు చెందిన ఇంటిగోడ కూలిపోయింది. పాలకుర్తికి చెందిన వర్రె వెంకన్నకు చెందిన 20ఎకరాల వరిపంట నేల రాలింది.

▸ స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెంకు చెందిన దైద ఉదయ్ అనే యువకుడు తన అమ్మమ్మ ఊరు తమ్మడపల్లికి వెళ్తుండగా గూడూరు చెరువు అలుగు పోస్తుండగా పక్క నుంచి మోటార్ సైకిల్ పై వెళ్తూ జారిపడగా, పంచాయతీ కార్యదర్శి లింగయ్య కాపాడగా, బైక్ కొట్టుకుపోయింది.

▸ స్టేషన్‌ఘన్‌పూర్: చంద్రుతుండాకు చెందిన మాలోతు శంకర్‌కు చెందిన ఆరు ఎకరాలు, నెమలిగొండకు రైతు గాదె కుమార్‌కు చెందిన 11 ఎకరాలు, ఇప్పగూడెం రైతే బోయినికుమార్‌కు చెందిన 7 ఎకరాల వరి నేలవాలింది. ఇప్పగూడెం ఐకేపీ సెంటర్లో ధాన్యం మొలకెత్తింది.

▸ జఫర్‌గఢ్: తుఫాన్ తిడుగులో కడారి సమ్మయ్యకు చెందిన మూడెకరాల ధాన్యం, 9ఎకరాల సోయాబీన్ ఆరబోయగా వర్షకు కొట్టుకుపోయింది. సూరారం, తీగారం,తిమ్మంపేట, తమ్మడపల్లి(జి), కూనూరు, ఉప్పుగల్లు, తమ్మడపల్లి(ఐ), కోనాయిచలం గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. తిమ్మంపేట, జఫర్‌గఢ్, ఓబులాపూర్, తమ్మడపల్లి(జి), ఉప్పుగల్లు తదితర గ్రామాల పరిధిలోని లోలెవల్ వంతెనల మీదుగా వరదలు, వాగులు పొంగి పొర్లడంతో రాకపోకలు స్తంభించి పోయాయి.

▸ లింగాలఘణపురం: మండలంలో చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. చీటకోడూరు రిజర్వాయర్ ఔట్‌ఫ్లో వరద కారణంగా నవాబుపేట రిజర్వాయర్ మత్తడి దూకుతోంది. నెల్లుట్ల, పటేల్‌గూడెం, నవాబుపేట, వనపర్తి, కొత్తపల్లి, నేలపోగుల, లింగాలఘణపురం చెరువులు మత్తడి దూకడంతో వరదనీటికి పొలాలన్నీ నీటమునిగాయి. వడ్డిచర్లలో చెందిన ఇళ్లలోకి వరదనీరు రావడంతో తహసీల్దార్ రవీందర్, ఎంపీవో రఘురామకృష్ణ, ఆర్ఐ కిశోర్, పంచాయతీ కార్యదర్శి రమ్య, జీపీవో దిలీప్‌లు బాధితులతో మాట్లాడి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు.

▸ తరిగొప్పుల: తుఫాన్ దాటికి తరిగొప్పుల మండలంలో పంటలు నిండా మునిగి పోవడంతో రైతులు భోరున విలపిస్తున్నారు. తెల్లబంగారం చేల్లలోనే నల్లబారిపోయింది.

▸ చిలుపూర్: మండలంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. నష్కల్‌కు వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే అండర్‌బ్రిడ్జి వరదతో నిండిపోయింది. ఆర్ఎస్ ఘన్‌పూర్ - రాజవరం దేవాదుల రిజర్వాయర్‌తోపాటు, మల్కాపూర్ పెద్ద చెరువు, నష్కల్ ఆకేరువాగు మత్తడి పోస్తుండడంతో దిగువన ఉన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ విజయ్‌కుమార్ గ్రామాల్లో పర్యటించారు. గార్లగడ్డ తండా సమీపంలో ఉన్న మల్లన్నగండి రిజర్వాయర్‌తో పాటు, ఆకేరువాగు మత్తడి వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

▸ రఘునాథపల్లి: మండేలగూడెంలో వాగులోకి భారీ వృక్షాలు కొట్టుక రావడంతో వరద నీరు నిలిచి, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండల కేంద్రంలో బుధవారం రాత్రి ద్యావర సత్తయ్య తన వ్యవసాయ క్షేత్రంలో ఉన్న పశువుల కొట్టంలో రెండు ఎద్దులను కట్టేయగా, వెల్ది వాగు పొంగి పొర్ల డంతో కొట్టంలోకి వరద చేరి ఎద్దు మృతిచెందింది. దీని విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని సత్తయ్య వాపోయాడు. కాగా, మరో ఎద్దు వరదలో కొట్టుకుపోతుండగా వరదలో ఈదుకుంటూ కాపాడినట్టు పేర్కొన్నాడు.


వల్మిడి, ముత్తారం కల్వర్టుపై నీటి ప్రవాహం


కోతకు గురైన కొత్తపల్లె, మల్కాపూర్ రోడ్డు


కోతకు గురైన వడ్డేగూడెం - హిమ్మత్‌నగర్ రోడ్డు


వావిలాలలో కోతకు గురైన రోడ్డు


మత్తడిపోస్తున్న వడ్డిచర్ల చెరువు


మండేలగూడెంలో కొట్టుకొచ్చిన భారీ వృక్షాలు


మీదికొండలో నీట మునిగిన మొక్కజొన్న కుప్పలు

బాధిత రైతుల్ని ఆదుకోవాలి


లింగాలఘణపురంలో పరిశీలిస్తున్న కనకారెడ్డి

జఫర్‌గఢ్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షంతో దెబ్బతిని నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య, సీపీఎం మండల కార్యదర్శి గుండెబోయిన రాజుడిమాండ్ చేశారు. కోనాయిచలం, ఉప్పుగల్లు, కేజీ తండా, కూనూరు, జఫర్‌గఢ్, తమ్మడపల్లి(జి), తదితర గ్రామాల్లో రైతు సంఘం, సీపీఎం నాయకులు పర్యటించి వర్షాలతో దెబ్బతిన్న రైతుల పంటలను పరిశీలించారు. కార్యక్రమాల్లో రైతు సంఘం, సీపీఎం నాయకులు రాయపురం బిక్షపతి, వెంకటయ్య, సాంబయ్య, కొమురయ్య, యాదయ్య, కుమార్, రమేశ్, వీకే.సుధాకర్ పాల్గొన్నారు.

పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన సీపీఎం నాయకులు

● లింగాలఘణపురం(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం లింగాలఘణపురం మండలం కళ్లెం, సిరిపురం, గుమ్మడవెల్లి, బండ్లగూడెం, లింగాలఘణపురం గ్రామాల్లో నేలవాలిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొడ్డు కర్ణాకర్, తూటి దేవదానం, గోసంగి శంకరయ్య, రాపోలు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.50వేలు పరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి మాచెర్ల సారయ్య, జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గూడూరులో పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు బెల్లి సంపత్, కుమార్, రమేష్, వెంకన్న, బక్క కొంరయ్య, సోమయ్య ఉన్నారు.


కూనూరులో పంటను పరిశీలించి సోమయ్య


గూడూరులో పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు


కృష్ణాజీగూడెంలో పరిశీలిస్తున్న సాదం రమేష్

● బచ్చన్నపేట(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ కోరారు. సీపీఎం బృందం ఐకేపీ కేంద్రాలను పత్తి, నేల కొరిగిన వరి చేలను, తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు మినలాపురం ఎల్లయ్య, తాడెం రాములు, బలరాములు, అశోక్, సమ్మయ్య, బాలరాజు, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

● చిలుపూర్(ఆంధ్రజ్యోతి): వర్షానికి నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.50వేల పరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కృష్ణాజీగూడెంలో కోతకు గురై నేలవాలిన వరి, మొక్కజొన్న, పత్తి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఊరడి లింగయ్య, బిక్షపతి, పోలు శ్రీనివాస్, మూడికె భీమయ్య, ఊరడి రవి, సంగి వెంకటయ్య, సాదం చంద్రయ్య పాల్గొన్నారు.

4న జిల్లా స్థాయి కళాకారుల ఎంపిక

జనగామ కల్చరల్ అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి యువజన కళాకారుల ఎంపిక నవంబరు 4న చేపడుతున్నట్టు జిల్లా యువజన, క్రీడల అధికారి కోదండ రాములు గురువారం ఒక ప్రకటనతో తెలిపారు. జాతీయ యువజనోత్సవాల సందర్భంగా ఈ నెల 31 న జరగాల్సిన జిల్లా స్థాయి యువ కళాకారుల ఎంపిక భారీ వర్షాల నేపథ్యంలో నవంబరు 4తేదీకి మార్చినట్టు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు జనగామ జిల్లా కేంద్రంలోని జుబ్లీ ఫంక్షన్ హాల్‌లో హాజరు కావాలని కోరారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్దంటూ నిరసన


ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న ఛాగల్ వాసులు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఛాగల్‌లో జాతీయ రహదారి పై ఫుట్ ఓవర్ బ్రిడ్జి కాకుండా, అండర్‌పాస్ బ్రిడ్జినే ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు చేయడానికి వచ్చిన వారిని అడ్డుకొని గురువారం నిరసన తెలిపారు. బీఆర్ఎస్ మునిసిపల్ పట్టణాధ్యక్షుడు కనకం గణేష్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొందరు వారి వ్యక్తిగత లాభపేక్షతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం మంజూరు అయిన చోట కాకుండా మరో చోట ప్రజలకు ఇబ్బంది కలిగేలా ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు అన్నెపు అనిల్, పొన్న రాజేష్, బలగాని అనిల్, సురేష్, విజేందర్, అశోక్, చేపూరి మహేందర్, ఎమ్డీ సర్వర్, గణేష్, అంజాత్, ఎమ్డీ రఫీ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి

మహదేవపూర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి ఉధృతి పెరుగుతోంది. ఎగువన ఉన్న ఎల్లంపల్లి గేట్లు ఎత్తివేయడంతో గోదావరి వద్దకు పెద్ద ఎత్తున వరద చేరుతోంది. తుఫాన్ ప్రభావంతోపాటు ఎగువ నుంచి వచ్చే వర దతో గోదావరి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం కాళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 7.25 మీటర్లు ఉంది.

ఆత్మగౌరవ ప్రదర్శనను జయప్రదం చేయాలి


లింగాలఘణపురంలో మాట్లాడుతున్న సునీల్

లింగాలఘణపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1న హైద్రాబాద్‌లో నిర్వహించనున్న దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లా ఇన్‌చార్జి బోడ సునీల్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం లింగాలఘణపురం మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశానికి సునీల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధికారప్రతినిధి సందెన రవీందర్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు గడ్డం సోమరాజు, నల్ల ఉపేందర్, కంటి వెంకటయ్య, గట్టగల్ల యాదగిరి, బస్వగాని మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

● జనగామ రూరల్: దళితుల ఆత్మగౌరవ మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్ పిలుపునిచ్చారు. జనగామలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 1న హైదరాబాద్‌లో నిర్వహించే దళితుల ఆత్మ గౌరవ మహాప్రదర్శనకు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బిర్రు నగేశ్, గడ్డం సోమరాజ్, ధరావత్ స్వామి, పత్తి సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.


జనగామలో సమావేశంలో మాట్లాడుతున్న తాళ్లపల్లి కుమార్

ఘనంగా సుదర్శన హోమం

చిలుపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం సుదర్శన హోమాన్ని నిర్వహించారు. వేద పండితులు బ్రాహ్మణపల్లి రవిందర్ శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల మధ్య ఉత్సవ మూర్తులకు మాస కల్యాణం జరిపించారు. దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న దేవతామూర్తులకు పట్టువస్త్రాలు సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన పేరి ప్రభావతి -లక్ష్మణ్‌రావు దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మోహన్, ధర్మకర్తలు రత్నాకర్‌రెడ్డి, గోలి రాజశేఖర్, వేంకటేశ్వర్లు, గనగోని రమేష్, పుల్యాల నారాయణరెడ్డి పాల్గొన్నారు.



పంట క్షేత్రాల పరిశీలనలో అధికారులు


తొర్రూరులో పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

పాలకుర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో మండలంలో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఏడీఏ పరశురాం అన్నారు. గురువారం మండలంలోని దెబ్బతిన్న పంటల్ని క్షేత్రస్థాయి సర్వే చేయించారు. మండలంలో వరి 3765 ఎకరాల్లో, పత్తి 2,00 2ఎకరాల్లో, మొక్కజొన్న 133 ఎకరాల్లో, ఇతర పంటలు 22ఎకరాల్లో దెబ్బతి న్నాయని ప్రాథమిక అంచనాలు చేసినట్లు తెలిపారు. అయనతో ఏవో కర్ణాకర్, ఏఈవో వెంకటేష్ ఉన్నారు.